# ఆత్మ సౌందర్యం

సి. వనజారెడ్డి



"దేవీ ఎందుకా విచారం"?

"ఈ భూలోకంలో ఎన్నో ప్రశాంతమైన ఆశ్రమాలు, అందమైన ఉద్యానవనాలు వున్నాయని మీరోసారి అన్నారు. మరి మనం సేదదీరుటకు అనువైన ప్రదేశమే కనిపించదేమి స్వామీ?"

"అది భూతకాలం. ప్రస్తుతం మనకు కనిపిస్తున్న ఈ పొగలూ, వినిపిస్తున్న శబ్దాలే భూలోకమంతా నిండి వున్నాయి"

" ఈ పొగలేమిటి?, భక్తులు యజ్ఞహోమాధులతో మనల్ని స్తుతిస్తున్నారా? అలాగైతే సాంబ్రాణి పొగలు మనసుకు హాయిని కలిగించాలేకానీ ఈ దుర్గంధమేమీ స్వామీ?"

"ఇవి కాలుష్యపు ప్రతీకలు, ఇంకా ఇక్కడే వుంటే మనం వైద్యున్ని సంప్రదించాల్సి వస్తుంది. భూలోకంలోని కాలుష్యం ముందు మనం తాగిన అమృతం వెల వెలా పోతుంది."

"మరి ఈ మానవుడు మనకన్నా శక్తివంతుడా? దీన్ని ఎలా ఎదుర్కొంటున్నాడు?"

"నేటి మానవుడు నిత్య ఔషధ సేవకుడు. ఇక్కడం వుండటం చాలా ప్రమాదకరం. ఇకనైనా మన లోకానికి బయలుదేరుదాం దేవీ"

భూలోక విహారానికి వచ్చిన శ్రీమహాలక్ష్మి, శ్రీమన్నారాయణుడు ఇక్కడ కాలు మోపలేక తిరిగి వైకుంఠానికి బయలుదేరారు.

అంతలో లక్ష్మీదేవి "స్వామీ అటు చూడండి. ఆ ప్రదేశం ఎంత అందంగా ఉందో! ఆ దీపాల కాంతి మనసుని ఆకట్టుకునేలా వుంది. ఆ కోలాహలం ఏమిటో?" అని భర్తను అడిగింది.

"అది అందాల ప్రదర్శన" చెప్పాడు లక్ష్మీనాధుడు.

"అంటే అందమైన వస్తువుల్ని ప్రదర్శిస్తారా?"

"ఆ అలాంటిదే"

"అలాగైతే అక్కడికి వెళ్ళి మన మనసుకు నచ్చినదానికి మూల్యం చెల్లించి ఇక్కడి జ్ఞాపికగా వైకుంఠానికి తీసుకుపోదాం" ఆనందంగా అడిగింది లక్ష్మీదేవి.

"దేవీ! నీవనకుంటున్నట్టు అవి మామూలు బొమ్మలు కాదు. ప్రాణమున్న బొమ్మలు. దేశ దేశాల్లోని ఆడపిల్లలు వారి వారి అందచందాల్ని ప్రదర్శించి పోటీలో బహుమతులు సాధిస్తారు"

"ఏమిటీ వైపరీత్యం, ఆడపిల్లలు వారిని వారు ప్రదర్శించుకుంటారా? అందులో పోటీయా?" లక్ష్మీదేవి ఆశ్చర్యపడిపోయింది.

"అవును దేవీ! భూలోకంలో ప్రతీ రంగంలో పోటీ విపరీతంగా పెరిగిపోయింది. పోటీలో వెనకపడిపోతామనే భయంతో మనిషి ఏం చేయడానికైనా సిద్ధంగా వున్నాడు. ఇక్కడ స్త్రీ అందం డబ్బు సంపాదించే వనరుగా మారింది. ఈ అందాల పోటీల్లో స్త్రీ వ్యక్తిత్వానికి చోటు లేదు. అన్నీ శరీరపు కొలతలే! ఇందులో గెలిచినవారిని ఈ ప్రపంచం ఆకాశానికి ఎత్తేస్తుంది. వారు రాత్రికి రాత్రే కోటీశ్వరులైపోతారు" వివరించాడు నారాయణుడు.

"అలా జరగడానికి వీల్లేదు. మగవాడి జీవితంలో తల్లిగా, చెల్లిగా, భార్యగా, కూతురుగా ఉన్నత స్థానంలో ఉండాల్సిన స్త్రీ జాతిని ఇలా అవమానిస్తే మీరు వూరుకుంటారా? ఇదేనా ధర్మం?" ఆవేశంగా అడిగింది లక్ష్మీదేవి.

**"స్త్రీ చైతన్యమే ఇందుకు పరిష్కారం. తమ సమస్యలకు కారణం తెలిసి కూడా పరిష్కార దిశగా కదలకుండా నిరుత్సాహంగా జీవితాల్ని లాగించేసే ఎంతోమంది స్త్రీలు భూలోకంలో వున్నారు. భూలోక స్త్రీలలో సంపూర్ణ చైతన్యం రావడానికి ఇంకా కొంత సమయం పడుతుంది దేవీ!"**

ఇలా సంభాషించుకుంటూ లక్ష్మీ,నారాయణులిద్దరూ వైకుంఠపురం చేరుకున్నారు.

***

కొంతకాలానికి నారదుడు 'నారాయణ! నారాయణ!!' అంటూ వైకుంఠంలో సతీసమేతంగా వున్న శ్రీహరిచెంతకు వచ్చాడు.

"నారదా! లోకసంచారి!! ఏమిటీ విశేషాలు?" అని ప్రశ్నించాడు శ్రీహరి.

" తమకు తెలియందేముంది జగన్నాధా! ఇంద్రుడు ఎప్పుడో భూలోకంలో అందాల పోటీల్ని తిలకించాడట, లోకసంచారిని కదా! వాటి వివరాలు నన్నడిగి తెలుసుకున్నాడు. ఇప్పుడా పోటీల్ని స్వర్గంలో నిర్వహిస్తాడంట!"

"అలాగా" అన్నాడు మహావిష్ణు

"వినాశకాలానికి విపరీత బుద్ధులు. ఆ ఇంద్రుని పతనం ప్రారంభమైందన్నమాట!" లక్ష్మీదేవి ఉక్రోషంతో అంది.

"యక్ష, కిన్నెర, నాగ, గంధర్వ, అప్సర, దేవకన్యలతోపాటు మరణానంతరం భూలోకాన్ని విడిచిపెట్టిన

మానవకాంతలు కూడా ఈ పోటీలో పాల్గొనాలని ఆ దేవేంద్రుని ఆదేశం. విశ్వసుందరిని ఎన్నుకోవడానికి బృహస్పతి ఆధ్వర్యంలో పదిమంది న్యాయనిర్ణేతల బృందం కూడా తయారైంది స్వామీ!" దేవలోకంలో జరిగే అందాల పోటీ గురించి మరిన్ని వివరాలు అందించాడు నారదుడు.

"అయితే మొదటిసారిగా దేవలోకంలో జరుగుతున్న ఈ పోటీల్ని మేము కూడా తిలకించాల్సిందే! అన్నాడు శ్రీహరి.

"స్వామీ! మీరు కూడా!!"

"అవును దేవీ! ఆ అందాల ప్రదర్శన చూడాలని మా మనసు ఉవ్విళ్ళూరుతున్నది" అన్నాడు నారాయణుడు.

"అవున్లే ఎంతైనా మీరూ మగవారేగా..." విసురుగా అక్కడనుండి వెళ్లిపోయింది లక్ష్మీదేవి.

***

దేవలోకంలో పోటీలు ప్రారంభమయ్యాయి. కొన్ని రౌండ్ల పోటీల తర్వాత చివరగా ఓ పదిమంది సుందరీమణులను ఆఖరి రౌండు పరీక్షకు ఎంపిక చేశారు. చివరి పోటీని ఇంద్రసభలో ఏర్పాటు చేశారు. ఇంద్రుడు, త్రిమూర్తులు, నారదుడు, కుబేరుడు, యముడు...తదితర దేవతామూర్తులే కాక స్వర్గాన్ని చేరుకున్న అనేక మానవ పురుష ఆత్మలు సభను అలంకరించాయి.

కొద్ది క్షణాల్లో పోటీ ప్రారంభం కాబోతుందనగా సభ వెలుపల ఏదో గొడవ జరుగుతున్నట్టు కలకలం మొదలైంది. నినాదాలు వినిపించాయి. లక్ష్మి, పార్వతీ, సరస్వతీ...మొదలగు దేవతా స్త్రీలు 'మహిళాసంఘం'గా ఏర్పడి అందాల పోటీని నిలిపేయాలని బయట ధర్నా చేస్తూ నినాదాల్ని చేయడం మొదలు పెట్టారు. అయినా ఫలితం లేదు. పోటీ మొదలైంది.

ఆఖరి రౌండు పోటీకి మిగిలిన పదిమంది స్టేజి మీద వయ్యారంగా నడవడం మొదలు పెట్టారు. వారి తెలివితేటల్ని పరిశీలించడానికని ఏవో కొన్ని నాసిరకం ప్రశ్నల్ని అడిగారు. ప్రదర్శన పూర్తయ్యింది.

మొత్తం పోటీలకు సంబంధించి 'అందమైన కళ్ళ సుందరి', 'అందమైన కాళ్ళ సుందరి', 'అందంగా నడిచే సుందరి'...ఇలా రకరకాల విభాగాల ఫలితాల్ని ప్రకటించారు. ఆ తర్వాత ఆఖరి రౌండు ఫలితాలకు సంబంధించి మూడు రెండు స్థానాల్ని ప్రధాన న్యాయమూర్తి బృహస్పతి ప్రకటించాడు.

ఇక చివరగా 'విశ్వసుందరి' ఫలితం కోసం ప్రేక్షకులంతా ఉత్కంఠతతో ఎదురు చూస్తున్నారు. సభ ఒక్కసారిగా ఇసుక రేణువు వేస్తే వినిపించేంత నిశ్శబ్దంగా తయారైంది.

'మిస్ యూనివర్స్'గా భారతదేశ స్త్రీ మిస్ అరవింద ఎంపికైనట్టు ఆ నిశ్శబ్దంలోనుండి ఓ ప్రకటన వెలువడింది. ఒక్కసారిగా కరాతళ ధ్వనులు. మరణానంతరం పై లోకాలకు చేరుకున్న మానవ కాంత అరవింద ఉదాసీనంగా వేదికపైకి వచ్చింది. 'ఆహా!



ఏమి ఆ అందం' అని అంతా నోళ్లు తెరుచుకొని చూస్తుండిపోయారు.

విశ్వసుందరిగా ఎన్నికైన అరవిందకు కిరీటం తొడుగుతూ ప్రత్యేక అతిథి బ్రహ్మ వేదికమీదనే 'మిస్ అరవిందా, భూమండలమంతా మీ ఆధీనంలోకి వస్తే మీరు చేసే మొట్టమొదటి పని ఏమిటి?' అని ప్రశ్నించారు.

'ఈ అందాల పోటీల్ని నిషేధిస్తాను" సమాధానం చెప్పింది అరవింద.

అందరి మొహాల్లో ఆశ్చర్యం.

"అదేమిటి! ఈ విశ్వానికంతటికీ అందమైనదానివని ఈ పోటీలో నిరూపించుకున్న నవ్వు దీన్ని వ్యతిరేకించడమా?" అడిగాడు పరమేశ్వరుడు.

ఈ ప్రశ్నకు అరవింద ఏం సమాధానం చెబుతుందా అని అందరూ ఆమె వైపే చూస్తున్నారు.

"నా అందమే నా జీవితాన్ని నాశనం చేసింది. నా అందంతో నా కుటుంబం, సమాజం ఆడుకుంది. దాన్ని ఎరగా చూపి చాలా మంది లాభపడ్డారు.." అంటూ చెప్పసాగింది అరవింద.

"మధ్యతరగతికి చెందిన తల్లితండ్రులకు నేను ఒకే కూతుర్ని. చిన్నప్పటినుండీ చదువులో ఎంతో చురుకుగా ఉండేదాన్ని. బాగా చదివి నా మేధా శక్తులతో గొప్పశాస్త్రవేత్తగా గుర్తింపు పొంది నా దేశమైన భారతదేశం గర్వించేవిధంగా అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు సంపాదించుకోవాలనేది నా చిన్ననాటి కోరిక. యవ్వన దశ వచ్చేసరికి నా అంత అందమైన అమ్మాయి మరొకరుండరని అంతా నన్ను పొగిడేవారు. అందాల పోటీలలో అది వరకే గెలుపొందిన వారు నా కాలిగోటికి కూడా సరిపోరని నా స్నేహితులు అంటుంటే మురిసిపోయేదాన్ని. ఆ పోటీల్లో పాల్గొనమని స్నేహితులు, బంధువులు, ఆఖరికి నన్ను కన్న తల్లితండ్రులు కూడా ప్రోత్సహించారు. నా వ్యక్తిత్వానికే కాదు, మొత్తం స్త్రీ జాతికే ఆ పోటీలు అవమానకరమని తెలిసినా అందులో నేను పాల్గొనేలా, ఆ వూబిలో కూరుకొని పోయేలా చేసింది నా చుట్టూ వున్న సమాజం. ఎంతో డబ్బు, పేరు సంపాదిస్తాననే ఆత్మవిశ్వాసం నాలో స్వార్థాన్ని పెంచింది. ఫలితంగా మూడేళ్లు ఆ పోటీల కోసం పలురకాల వ్యాయామాలు చేసి, నిపుణుల పర్యవేక్షణలో కృత్రిమ సౌందర్యసాధనాల ద్వారా నా అందానికి మరిన్ని మెరుగులు దిద్దుకొని...మెరుపు తీగ ఆకారం కోసం నా కడుపు మాడ్చుకున్నాను. కానీ మిస్ ఇండియాకు జరిగిన పోటీలో నాకు ఏ స్థానమూ లభించలేదు. నా స్నేహితులముందూ, బంధువుల ముందూ అవమానం భరించలేక...గొప్ప శాస్త్రవేత్తను కావాలనే నా చిన్ననాటి కలను నెరవేర్చుకొనే చదువు చదవ లేక...శరీరానికి తప్ప మనసుకు ప్రాముఖ్యతలేని మోడలింగ్ రంగంలో ఘోరంగా మోసపోయి నా ఆత్మకు సమాధానం చెప్పుకోలేక మనోవ్యధతో ఆత్మహత్య చేసుకున్నాను. భూమి మీద భారతదేశంలాంటి వర్ధమాన దేశాల్లో ఎంతో మంది అమాయకురాళ్ళు సంపదతో తులతూగే దేశాల మాయలోపడి వారు తయారు చేసే సౌందర్య సాధనాలకు తమ దేశాల్లో మార్కెట్ అవకాశాల్ని పెంచుతూ తమ స్వంత దేశాల అభివృద్ధిని పట్టించుకోవడం లేదు. అసలు అందానికి కొలమానేది వుండనే వుండదు. సౌందర్యం, అందం అనే భావనలు సాపేక్షమైనవి. అవి చూసేవాడి దృష్టినిబట్టి వుంటాయి. ఒకరికి అందంగా కనిపించింది మరొకరికి అందంగా వుండకపోవచ్చు. ఒకరికి వికారంగా కనిపించినది మరొకరికి అందంగా వుండవచ్చు. ఈ అందాల పోటీలు స్త్రీ అభివృద్ధికి అడ్డంకుగా నిలిచేవే తప్ప ఎందుకూ పనికిరావు. కొంతమంది 'అందాల పోటీల వలన స్త్రీలు సమాజంలో తమ ఉనికిని చాటుకుంటారని..తద్వారా వారికి అవకాశాలు మెరుగవుతాయని...'ఇలా ఏమేమో సిద్ధాంతాలు చెబుతారు. కాని ఈ సమాజ గుర్తింపు అందాల పోటీల ద్వారా కాకుండా కూడా సాధించవచ్చని ఇందిరాగాంధీ, సరోజనీ నాయుడు, మదర్‌థెరిసా, హెలెన్ కెల్లర్, మేడం క్యూరీ...లాంటి ఎందరో వనితలు నిరూపించారు. వాళ్లందరూ ఈ పోటీల్ని నిరసిస్తూ బయట ధర్నా చేస్తున్నారు. అందమనేది బాహ్యరూపానికే చెందింది కాదు. హృదయానికి సంబంధించింది కూడా. చేతనైతే అందమైన హృదయమున్న వారిని విశ్వహృదయ సుందరిగా ఎంపిక చేయండి. ఇంద్రుడి ఆదేశానికి ఎదురు చెప్పలేక నేను ఈ పోటీకి అంగీకరించాను. మా భూలోకంలో న్యాయ నిర్ణేతలు అందమైన వనితను ఎంపిక చేయడంలో ఘోరమైన తప్పిదం చేస్తున్నారు. కనీసం ఈ దేవలోకంలోనైనా అందమైన వనితను మీరు గుర్తిస్తారని అనుకున్నాను. మీరు కూడా కొలతలు, వయ్యారాలు చూసి నన్ను ఎంపిక చేశారు. మీ ఎంపిక కూడా తప్పే" అంటూ ఒక క్షణం ఆగి అరవింద తన తలమీది కిరీటాన్ని తీసి ధర్నా చేస్తున్న మదర్‌థెరిసా ఆత్మను పిలిపించి ఆమె తలకు ఆ కిరీటాన్ని తొడిగింది.